బీఆర్ఎస్ గ్రేటర్ కార్యనిర్వాహక కార్యదర్శిగా మోజెస్



రాంనగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ కార్యనిర్వాహక కార్యదర్శిగా బీఆర్ఎస్ రాంనగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు, పార్టీ సీనియర్ నాయకుడు రావులపాటి మోజెస్ నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ బుధవారం ప్రకటించారు. మోజెస్ గతంలో టీడీపీ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడిగా పనిచేశారు. 2014లో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ పార్టీలో రాంనగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షుడిగా పనిచేశారు. ఈ సందర్భంగా మోజెస్ రాంనగర్‌లో విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ బలోపేతానికి చేసిన సేవలను గుర్తించి గ్రేటర్ కార్యనిర్వాహక కార్యదర్శి పదవి ఇచ్చినందుకు పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గ్రేటర్‌లో పార్టీ పటిష్ఠత కోసం కృషిచేస్తానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడుతానన్నారు.

బస్తీ దవాఖానాల్లో బీపీ మందులు ఇవ్వాలి : టీజేఎస్

చిక్కడపల్లి అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బస్తీదవాఖానాల్లో బీపీ మందులు ఇవ్వాలని టీజేఎస్ ముషీరాబాద్ కన్వీనర్ మెరుగు శ్రీనివాస్‌యాదవ్ విజ్ఞప్తి చేశారు. బుధవారం సాయంత్రం ఆయన అశోక్‌నగర్‌లో మాట్లాడారు. గాంధీనగర్ డివిజన్ అరుంధతినగర్ బస్తీ దవాఖానాలో నెలకు సరిపడా బీపీ టాబ్లెట్లు రోగులకు ఇచ్చేవారని రెండునెలలుగా ఇవ్వడంలేదని ఆరోపించారు. దీంతో బీపీ పేషెంట్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్కువ ఖరీదు గల బీపీ గోలీలు రోగులకు యధావిధిగా ఇవ్వాలని ఆయన కోరారు.



గార్బీ వేడుకల్లో జైసింహ తదితరులు

మతసామరస్యానికి ప్రతీక గార్బీ : జైసింహ

ముషీరాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గార్బీ ఉత్సవాలు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయని బీఆర్ఎస్ యువజన కమిటీ నగర నాయకుడు ముఠా జైసింహ అన్నారు. బుధవారం బోలక్‌పూర్ డివిజన్‌లోని బంగ్లాదేశ్ మార్కెట్‌లో బీఆర్ఎస్ నాయకుడు జహంగీర్ ఆధ్వర్యంలో గార్బీ షరీఫ్‌ను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ముఠా జైసింహ ముస్లింలతో కలిసి సామూహిక ప్రార్థనలు చేశారు. అనంతరం పీర్లకు దట్టీలను సమర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ బోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్ రావు, బీఆర్ఎస్ మైనార్టీ కమిటీ రాష్ట్ర నాయకుడు రహీం, మైనార్టీ డివిజన్ కమిటీ అధ్యక్షుడు మగ్బూల్, మీడియా సెల్ ఇన్‌చార్జి ప్రవీణ్, పార్టీ నాయకుడు సుమన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య కేసులో లభించని ఆచూకీ



గుర్తుతెలియని మహిళ మృతదేహం

బర్కత్‌పుర, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): మూసీ నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన మహిళ వివరాలు ఇంకా తెలియలేదు. ఈ నెల 11న 42 నుంచి 45 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని మహిళ చాదర్‌ఘాట్ బ్రిడ్జి నుంచి మూసీలోకి దూకి ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. ఈ మహిళ ఆత్మహత్య చేసుకుని ఆరు రోజులు కావస్తున్నా ఆమెకు సంబంధించిన వారు ఎవరు కూడా కాచిగూడ పోలీసులను సంప్రదించలేదు. ఈ మహిళ వివరాలను తెలుసుకోవడానికి పోలీసులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు కూడా ఆమె ఫొటోను పంపించామని, ఎవరైనా గుర్తుపడితే 8712660540, 8712660542 ఫోన్‌నంబర్లలో సంప్రదించాలని అడ్మిన్ ఎస్ఐ కె.సుభాష్ కోరారు.

బీసీ కులగణనకు రాజకీయ పార్టీలు సహకరించాలి

బడుగు, బలహీన వర్గాల కోసమే..: మాజీ ఎంపీ హనుమంతరావు

బర్కత్‌పుర, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న బీసీ కులగణనకు రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు, కుల, ప్రజాసంఘాలు సహకరించాలని మాజీ ఎంపీ వి.హనుమంతరావు అన్నారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసమే రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేపడుతోందన్నారు. బీసీ కులగణనకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేయడంపై హర్షం వ్యక్తంచేస్తూ అంబర్‌పేట ఆలీకేఫ్ చౌరస్తా సమీపంలో జ్యోతిరావు పూలే విగ్రహానికి ఆయన బుధవారం బీసీ సంఘాల నేతలతో కలిసి క్షీరాభిషేకం చేశారు. అనంతరం వీహెచ్ మాట్లాడుతూ రాష్ట్ర కేబినేట్‌లో బీసీ కులగణనపై 7 నెలల క్రితం నిర్ణయం తీసుకున్నారని అన్నారు. దేశానికి మొదటిసారి బీసీ ప్రధాని మోదీ రావడాన్ని స్వాగతించామన్నారు. అయితే కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పడుతుందని, బీసీ కులగణన చేపడతారని ఆశించిన వారికి ఆశాభంగం కలిగిందన్నారు. రాహుల్ గాంధీ పాదయాత్ర ద్వారా ప్రజా సమస్యలను తెలుసుకుని దేశంలోని 90 శాతం ప్రజలకు అన్యాయం జరుగుతోందని గుర్తించి కులగణన చేయాలని పేర్కొన్నారని గుర్తుచేశారు. ఈనెల 24 నుంచి రాష్ట్రంలో కులగణన జరుగుతుందని, ఇంటికి వచ్చిన అధికారులకు ప్రతి ఒక్కరూ తప్పకుండా తమ కులం, ఇంట్లో వారి సంఖ్యను తెలియజేయాలన్నారు. దీంతో భవిష్యత్‌లో ఉద్యోగ, ప్రమోషన్లలో అవకాశాలు వస్తాయన్నారు. వచ్చే పంచాయతీ ఎన్నికల్లో అందరికీ అవకాశం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పులి జగన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు శంభుల శ్రీకాంత్‌గౌడ్, గడ్డం శ్రీధర్‌గౌడ్, షేక్ జమీర్, కోటం అనిల్‌కుమార్, బీసీ సంఘం నేత గుజ్జ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అంబర్‌పేట ఆలీకేఫ్‌చౌరస్తా సమీపంలో జ్యోతిరావు పూలే విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎంపీ వి.హనుమంతరావు తదితరులు

మూసీ నది సుందరీకరణ పేరుతో పేదల ఇళ్లను కూల్చొద్దు

శివాజీ బ్రిడ్జి ర్యాక్ పిక్కర్స్ గుడిసె వాసులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించాలి : వక్తలు

రాంనగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మూసీ నది సుందరీకరణ పేరుతో పేదల ఇళ్లను కూల్చవద్దని, శివాజీ బ్రిడ్జి ర్యాక్ పిక్కర్స్ గుడిసె వాసులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని పలువురు వక్తలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) ఆధ్వర్యంలో బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు.

డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి టి.శంకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీపీఎం నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్, పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ, తెలంగాణ క్రాంతిదళ్ నాయకుడు పృథ్వీరాజ్, మానవ హక్కుల వేదిక నాయకుడు బాల్‌రాజ్, ప్రజా సంఘాల నాయకులు రఘునందన్, జాన్, నర్సింహప్రసాద్, పులి కల్పన తదితరులు మాట్లాడారు. శివాజీ బ్రిడ్జి ర్యాక్ పిక్కర్స్ గుడిసెల వాసులకు ప్రత్యామ్నాయం చూపిన తర్వాతనే ఖాళీచేయించాలని లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మూసీ బాధితులు భూలక్ష్మి, లాలప్ప, చెన్నయ్య, హరిబాబు, సామాజిక కార్యకర్త వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్, పాల్గొన్న వివిధ సంఘాల ప్రతినిధులు



సంస్థ సభ్యులను సన్మానిస్తున్న ప్రదీప్

సీనియర్ సిటిజన్స్ సిక్స్‌ప్యాక్ సూత్రాలను పాటించాలి

చిక్కడపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ సిక్స్‌ప్యాక్ సూత్రాలను పాటించాలని ప్రముఖ సినీనటుడు ప్రదీప్ అన్నారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్(నల్లకుంట)వార్షిక వేడుకలు బుధవారం రాత్రి త్యాగరాయగాన సభలో ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా ప్రదీప్ పాల్గొని సంస్థ సభ్యులను సన్మానించి మాట్లాడుతూ.. మనిషిని వార్ధక్య ఆలోచనే ముసలివారిని చేస్తుందన్నారు. కృష్ణశాస్త్రి కవితలో చెప్పినట్లు ఎప్పటికీ పడుచుగుండె ఉండేలా చూసుకోవాలన్నారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలను పాటిస్తే జీవితం ఆనందమయం అవుతుందన్నారు. ప్రధానకార్యదర్శి మాచర్ల రంగయ్య, పుల్లయ్య, జాయింట్ సెక్రటరీ నరసింగరావు, మురళీధర్, చంద్రబోసు, అభినందన భవాని తదితరులు పాల్గొన్నారు. తొలుత జైహింద్ సంస్థ సభ్యులు పలు సినీగీతాలను ఆలపించారు.

నేటి నుంచి చిరుధాన్యాలపై అంతర్జాతీయ సదస్సు

రాజేంద్రనగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్‌లోని జాతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ(ఐఐఎంఆర్), న్యూట్రీహబ్ ఆధ్వర్యంలో నేటి నుంచి 19వ తేదీ వరకు ఇంటర్నేషనల్ న్యూట్రీ సెరియల్స్ కన్వెన్షన్‌ను నిర్వహిస్తున్నారు. మొదటి రోజు సదస్సును రాజేంద్రనగర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్(నార్మ్)లో నిర్వహిస్తుండగా, రెండు, మూడు రోజుల్లో నోవాటెల్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్‌లో నిర్వహించనున్నారు. చిరుధాన్యాల అపారమైన సామర్థ్యాన్ని అన్వేషించడానికి, ప్రభుత్వ సంస్థలు, అంతర్జాతీయ ప్రతినిధులు, విద్యావేత్తలు, రైతులు, పరిశ్రమలు, స్టార్టప్‌ల నుంచి కీలకమైన వాటాదారులను ఒకేచోట చేర్చడం లక్ష్యంగా పెట్టుకుని ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. ఈ సదస్సులో 20కి పైగా దేశాల ప్రతినిధులతోపాటు భారతదేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి శాస్త్రవేత్తలు హాజరవుతారని ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ తారా సత్యవతి తెలిపారు.

వస్తుసేవల నాణ్యతాప్రమాణాలపై అవగాహన

చిక్కడపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వస్తుసేవల నాణ్యతాప్రమాణాలపై 33 రోజుల పాటు ప్రజల్లో చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వినియోగదారుల మండలి రాష్ట్ర అధ్యక్షుడు సాంబరాజు చక్రపాణి తెలిపారు. అంతర్జాతీయ ఆహార దినోత్సవం సందర్భంగా బుధవారం గోల్కొండ చౌరస్తాలోని రాష్ట్ర తూనికలు, కొలతల శాఖ రాష్ట్ర కంట్రోలర్ కార్యాలయంలో అసిస్టెంట్ కంట్రోలర్ రాజేశ్వర్‌తో కలిసి చైతన్య కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాంబరాజు చక్రపాణి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఈనెల 14న ప్రారంభమైన ఈ చైతన్య కార్యక్రమాలు వచ్చేనెల 16 వరకు కొనసాగుతాయని వివరించారు. ఈ సందర్భంగా తూనికలు, కొలతలశాఖ అసిస్టెంట్ కంట్రోలర్ రాజేశ్వర్‌తో వినియోగదారుల సమస్యలపై చర్చించడం జరిగిందని వివరించారు. కాగా వరంగల్, నిజామాబాద్, ఖమ్మం, భూపాలపల్లి, నల్గొండ, రంగారెడ్డి ఉమ్మడి జిల్లాల్లో వినియోగదారుల హక్కుల పరిరక్షణకు లీగల్ మెట్రాలజీ తరపున అన్ని చర్యలు చేపడతామని రాజేశ్వర్ హామీ ఇచ్చారని వివరించారు. ఈ కార్యక్రమంలో వినియోగదారుల మండలి ప్రతినిధులు పల్లెపాడు దామోదర్, మొగిలిచర్ల సుదర్శన్, శంకర్‌లాల్ చౌరాసియా, కాసు విశ్వేశ్వర్‌రాజు, ఎ.శివ పార్వతి, అనిల్‌కుమార్, నందు, ప్రవీణ్, రత్నాకర్, మహాదేవుని శ్రీనివాస్ పాల్గొన్నారు.



చైతన్యకార్యక్రమాలపై రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాజేశ్వర్, చక్రపాణి, దామోదర్ తదితరులు

గురుకుల పాఠశాలల అద్దెలు చెల్లించాలి

రాంనగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకుల పాఠశాలలు, హాస్టల్స్‌కు పెండింగ్‌లో ఉన్న అద్దెలు, అందులో పనిచేస్తున్న టీచర్లకు జీతాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడుపి.సాయిబాబా డిమాండ్ చేశారు. బుధవారం దోమలగూడలోని పార్టీ నగర కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల ప్రజలకు నాణ్యమైన విద్యను అందించాలని 1982లో నాటి మాజీ సీఎం ఎన్టీఆర్ గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. అలాంటి పాఠశాలలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. 9 నెలలుగా అద్దెలు చెల్లించకపోవడంతో ఆ భవనాల యజమానులు వాటికి తాళాలు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో టీడీపీ నగర ప్రధానకార్యదర్శులు నల్లెల కిషోర్, బాల్‌రాజ్‌గౌడ్, నాయకులు సి.ప్రకాష్, జి.యాదగిరిరావు, నాగునగేష్, మేడిపల్లి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సాయిబాబా తదితరులు

సెట్విన్‌లో ఎల్‌పీజీ కోర్సులు

చార్మినార్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సెట్విన్ ఆధ్వర్యంలో ఎల్‌పీజీ మెకానిక్(మూడు నెలలు), ఎల్‌పీజీ డెలివరీ బాయ్(రెండు నెలలు) శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సెట్విన్ మేనేజింగ్ డైరెక్టర్ కె.వేణుగోపాలరావు తెలిపారు. మోతిగల్లి, సీతాఫల్‌మండిలోని సెట్విన్ కేంద్రాల్లో శిక్షణ ఇస్తామని, ఆసక్తి గల అభ్యర్థులు 9010157312 లేదా 8142439336 ద్వారా అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఎల్‌పీజీ షోరూంలలో ఉద్యోగాలు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

- కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి



సీపీఎల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

అంబర్‌పేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలల విద్యార్థుల కంటే ఉత్తమ ఫలితాలు సాధించాలని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. భారత్ సేవాశ్రమ్ సంస్థ ఆధ్వర్యంలో అంబర్‌పేట సీపీఎల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత నోట్ పుస్తకాలను ఆయన బుధవారం పంపిణీ చేసి ప్రసంగించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు అన్ని విభాగాల్లో ప్రతిభ కనబరచాలని సూచించారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు తమవంతు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భారత్ సేవాశ్రమ్ సంస్థ ప్రతినిధులు మునీశ్వరానంద స్వామి, వెంకటేశ్వరానందస్వామి, హైదరాబాద్ జిల్లా డీఈవో రోహిణి, హిమాయత్‌నగర్ జోన్ డిప్యూటీ ఈవో విజయలక్ష్మి, డిప్యూటీ ఐవోఎస్ నిజాముద్దీన్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుశీలమ్మ, పోలీస్ బాయిస్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్, బీజేపీ నాయకులు నాగభూషణం చారి, ఆనంద్‌గౌడ్, రాజు, వెంకటస్వామిగౌడ్, యశ్వంత్, కృష్ణ ముదిరాజ్, ఏడెల్లి అజయ్‌కుమార్, బిక్షపతి, రాంచందర్‌గుప్తా, పెంటంరాజు, దయాకర్‌యాదవ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలి

- ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్



ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుషాల్‌గౌడ్, ముషీరాబాద్ అధ్యక్షుడు ఆయూష్

ముషీరాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చే విధంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. బుధవారం ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ బీజేపీ జాతీయ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా నియమితులైన సందర్భంగా ముషీరాబాద్‌కు చెందిన బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుషాల్‌గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు డాక్టర్ కె.లక్ష్మణ్‌ను కలిసి సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ డివిజన్, బీజేవైఎం అధ్యక్షుడు ఆయూష్, నాయకులు అజయ్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే ప్రశాంతంగా పండుగలు

- సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాన్స్ యాదవ్



సెంట్రల్‌జోన్ డీసీపీ అక్షాన్స్ యాదవ్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నగర నాయకుడు సయ్యద్ మసూద్, జెమీల్ తదితరులు

ముషీరాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజల సహకారంతోనే ఇటీవల జరిగిన పండుగలు ప్రశాంతంగా ముగిశాయని సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాన్స్‌యాదవ్ అన్నారు. భోలక్‌పూర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ నగర నాయకుడు సయ్యద్ మసూద్ ఆధ్వర్యంలో బుధవారం సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాన్స్ యాదవ్‌ను కలిసి గణేశ్, దేవీనవరాత్రి ఉత్సవాలు, మిలాద్ ఉన్ నబీ పండుగలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకున్నందుకు డీసీపీని సన్మానించారు. ఈ కార్యక్రమంలో భోలక్‌పూర్ కాంగ్రెస్ నాయకులు జమీల్, ఉస్మాన్, ఖైరత్‌అలీ, మహ్మద్ నుర్షద్, కరీం తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ లీకేజీ సమస్యను పరిష్కరించాలి

- కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి



మల్లికార్జున్‌నగర్‌లో డ్రైనేజీ లీకేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి

నల్లకుంట, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని మల్లికార్జున్‌నగర్‌లో కొన్ని రోజులుగా డ్రైనేజీ లీకేజీతో కలుషితనీటి సరఫరా అవుతోందని కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి అన్నారు. ఈ సమస్యను సత్వరం పరిష్కరించాలని జలమండలి అధికారులను ఆదేశించారు. బుధవారం డివిజన్‌లోని మల్లికార్జున్‌నగర్‌లో కార్పొరేటర్ పర్యటించి స్థానిక ప్రజలను కలిసి సమస్యను తెలుసుకున్నారు. జలమండలి సివరేజీ సూపర్‌వైజర్ లక్ష్మణ్ అందుబాటులో లేకపోవడంతో గురువారం వెంటనే సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ విష్ణువర్ధన్, ఏఈ మాజీద్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాత శాంతి పూజ, అన్నదానం

రాంనగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాంనగర్‌లోని చైతన్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం రాంనగర్ రామాలయం వెనుక వీధిలో దుర్గామాత శాంతి పూజ జరిగింది. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ గ్రేటర్ నాయకుడు ఎం.నాగేష్ ముదిరాజ్ ముఖ్యఅతిథిగా హాజరై పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు విన్ను ముదిరాజ్, బీజేపీ అడిక్‌మెట్ డివిజన్ మాజీ అధ్యక్షుడు పాశం సాయికృష్ణయాదవ్, ప్రతినిధులు ధీరజ్, రాము, సాయి, రవి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ గ్రేటర్ నాయకుడు ఎం.నాగేష్ ముదిరాజ్ తదితరులు

రైళ్లతో విన్యాసాల నివారణకు ప్రత్యేక బృందాలు

కాచిగూడ రైల్వే స్టేషన్ డైరెక్టర్ కె.బాలాజీ

బర్కత్‌పుర, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): నడుస్తున్న రైళ్లతో విన్యాసాల నివారణకు ప్రత్యేక బృందాల ఏర్పాటు చేసినట్లు కాచిగూడ రైల్వే స్టేషన్ డైరెక్టర్ కె.బాలాజీ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కాచిగూడ రైల్వేస్టేషన్‌లోని 1, 2 ప్లాట్‌ఫాంలపై ఇద్దరు ఆర్‌పీఎఫ్ స్టాఫ్, మరో ఇద్దరు టీటీలను ఏర్పాటు చేశామన్నారు. ఎంఎంటీఎస్ రైళ్ల రాకపోకలపై ఈ నలుగురి బృందంతో నిరంతం ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. మరో ఆర్‌పీఎఫ్ బృందం సీతాఫల్‌మండి, జామైఉస్మానియా, విద్యానగర్, మలక్‌పేట, డబీర్‌పుర, యాకత్‌పుర, ఉప్పుగూడ, ఉందానగర్ రైల్వేస్టేషన్ల వరకు ఎంఎంటీఎస్ రైలులో ప్రయాణిస్తూ విన్యాసాలను నివారించడానికి కృషి చేస్తారని తెలిపారు. కాచిగూడ రైల్వే స్టేషన్‌లోని 1, 2 ప్లాట్‌ఫాంలలో విన్యాసాల నివారణపై ప్రత్యేక పోస్టర్లను ఏర్పాటు చేశామని, టికెట్ కౌంటర్ల వద్ద కూడా నిఘా ఉంచడమే కాక స్ర్కీన్లపై డిస్‌ప్లే ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎవరైనా విన్యాసాలు చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



కె.బాలాజీ కాచిగూడ రైల్వే స్టేషన్ డైరెక్టర్

కాంగ్రెస్ జిల్లా కమిటీ సమావేశానికి తరలిన నేతలు

ముషీరాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గాంధీ భవన్‌లో బుధవారం జరిగిన వివిధ జిల్లాల కాంగ్రెస్ కమిటీ సమావేశానికి ముషీరాబాద్‌కు చెందిన సికింద్రాబాద్ జిల్లా ప్రధానకార్యదర్శి లింగాల శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్‌ను కలిసి ముషీరాబాద్‌లో చేపడుతున్న పార్టీ కార్యక్రమాలను వివరించారు. తరలివెళ్లిన వారిలో ముషీరాబాద్ కాంగ్రెస్ నాయకులు జయకుమార్, మధుసూదన్, యాదగిరి గౌడ్, సురేష్ తదితరులు ఉన్నారు.



గాంధీభవన్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశానికి తరలివెళ్లిన జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్ తదితరులు

రక్తికట్టించిన 'యుద్ధం తథ్యం' పద్యనాటకం

చిక్కడపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆరాధన సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి త్యాగరాయ గానసభలో యుద్ధం తథ్యం పద్యనాటక ప్రదర్శన రక్తికట్టించింది. దుర్యోధనుడిగా లక్ష్మీకాంతశర్మ, ధృతరాష్ట్రుడిగా సూర్యనారాయణమూర్తి, కర్ణుడిగా సాల్వాచారి, శకునిగా జంగయ్య గౌడ్, దుశ్శాసనుడిగా వెంకటనారాయణశర్మ నటించారు. ఈ సందర్భంగా జరిగిన సభాకార్యక్రమంలో ముఖ్యఅతిథిగా నాట్యగురువు నిర్మల ప్రభాకర్, సభాధ్యక్షుడిగా సాంస్కృతిక, సినీ కార్యక్రమాల నిర్వాహకులు డా.కె.ధర్మారావులు, యువకళావాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ, కళాభిమాని వెంకటరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకుడు లోకం కృష్ణయ్య ఆధ్వర్యంలో సంగీత దర్శకులు శ్రవణ్‌కుమార్, రాజబాబు, నటులు లక్ష్మీకాంతశర్మను సత్కరించారు.



పద్య నాటకంలో ఓ దృశ్యం

ఎస్‌హెచ్‌ఈ ఆధ్వర్యంలో వృద్ధులకు ఆహారం పంపిణీ

చిక్కడపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవం సందర్భంగా చిక్కడపల్లిలోని సొసైటీ ఫర్ హంగర్ ఎలిమినేషన్(ఎస్‌హెచ్‌ఈ) ఆధ్వర్యంలో బుధవారం నగర శివార్లలో ఉన్న చైతన్య వృద్ధాశ్రమంలో ఆహారంతోపాటు ఇతర పదార్థాలు అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ ముఖ్యకార్యదర్శి డా. సత్యనారాయణ ప్రసాద్ మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా రతన్‌టాటా, స్వామినాథన్ వంటి వారి స్ఫూర్తితో పారిశ్రామికవేత్తలు పేదరిక నిర్మూలనకు సహకరించాలని కోరారు. సొసైటీ ఉప కార్యదర్శి మహేశ్వర్ మాట్లాడుతూ తమ సొసైటీ ప్రారంభించిన నాటినుంచి పలు సంస్థలకు ఆహారం అందిస్తున్నామని వివరించారు. రెండు దశాబ్దాలకిందట భారతరత్న స్వామినాథన్ ఆశీస్సులతో రాజగోపాల్ తిరుపతిలో సొసైటీని ప్రారంభించారని తెలిపారు.



వృద్ధురాలికి ఆహారం అందజేస్తున్న సభ్యుడు